క్లుప్తంగా

కమనీయం.. శివపార్వతుల కల్యాణం



శివపార్వతులకు కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పేట బసవన్నకట్టవీధిలోని త్రిలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం శివపార్వతుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకుడు రాఘవ శర్మ శివపార్వతుల ఉత్సవ మూర్తులను ప్రత్యేక పూలు, పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు. 50 మంది దంపతులతో ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం స్వామివారి కల్యాణోత్సవాన్ని వేదమంత్రోచ్చారణల నడుమ జరిపించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. శివపార్వతులకు పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

పోలేపల్లి చెరువుకు కాలువలు నిర్మించండి

రామగిరి: మండలంలోని పోలేపల్లి చెరువుకు హంద్రీనీవా నీరందించేందుకు కాలువలు నిర్మించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, గౌరవాధ్యక్షుడు మహదేవ్ డిమాండ్ చేశారు. ఆదివారం గ్రామ సమీపంలోని చెరువును సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ చెరువు కింద 2వేల ఎకరాలు సాగవుతుందన్నారు. నాలుగు గ్రామాల ప్రజలు పంటలు సాగు చేసుకుంటారన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు ముత్యాలప్ప, మారెప్ప, ఈశ్వరయ్య, రామాంజనేయులు, కిష్టప్ప పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'కొక్కంటి క్రాస్'



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

తనకల్లు: స్థానిక సుధా టాకీస్ సమీపంలో ఉన్న మైదానంలో పది రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కొక్కంటిక్రాస్ జట్టు నిలిచింది. ఆదివారం తనకల్లు–కొక్కంటి క్రాస్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న తనకల్లు జట్టు నిర్ణీత 16 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 92 పరుగులు చేసింది. అనంతరం 93 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కొక్కంటి క్రాస్ కేవలం 10.3 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.25 వేలు, రన్నర్స్‌కు రూ.15 వేలు నగదు ట్రోఫీలను మనదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండా చంద్రమోహన్ (కేసీఎం) అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్లు యోగి, షామీర్, సీనియర్ క్రికెటర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని చూపుతున్న పోలీసులు

అమడగూరు: మండలంలోని లోకోజుపల్లి గ్రామ సమీపంలో ఆదివారం కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. వివిధ గ్రామాల్లో జలధి నిర్వహిస్తుండటంతో ముందస్తు జాగ్రత్తగా స్పెషల్ పార్టీ పోలీసులతో బార్డర్ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. తనకల్లు మండలం, గంగసానిపల్లికి చెందిన గంగులప్ప ద్విచక్ర వాహనంలో 288 కర్ణాటక మద్యం ప్యాకెట్లను తీసుకెళ్తుండగా లోకోజుపల్లి సమీపాన పట్టుకున్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసిన పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం, గుట్కా సరఫరా చేయడం చట్టరీత్యా నేరమన్నారు.

హాకీ అనంతపురం అసోసియేషన్ నూతన కమిటీ ఎంపిక



కమిటీ సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

ధర్మవరం: హాకీ అనంతపురం అసోసియేషన్ నూతన కమిటీలో ధర్మవరం హాకీ కోచ్‌కు చోటు దక్కింది. ఆదివారం అనంతపురంలో జరిగిన కార్యక్రమంలో హాకీ అనంతపురం ప్రధాన కార్యదర్శిగా హాకీ కోచ్ అనిల్‌కుమార్‌ను ఎంపిక చేశారు. హాకీ అనంతపురం అసోసియేషన్ అధ్యక్షుడిగా విజయబాబు, ప్రధాన కార్యదర్శిగా అనిల్‌కుమార్, కోశాధికారిగా హిమబిందు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో హాకీ ఆంధ్రప్రదేశ్ కోశాధికారి థామస్ పీటర్, కర్నూలు హాకీ కార్యదర్శి సుధీర్, అనంతపురం శాప్ అబ్జర్వర్ ధనుంజయరెడ్డి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి హిమకర్ పాల్గొన్నారు.

జలధి.. పరవశించిన మది



గాండ్లపెంట: జలధికి తరలిపోతున్న పీర్లు



బత్తలపల్లి: మాల్యవంతంలో ఊరేగుతున్న పెద్ద కాశీంస్వామి



తలుపుల: పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

- భక్తిశ్రద్ధలతో ముగిసిన మొహర్రం

బత్తలపల్లి: మండలంలో మొహర్రం వేడుకలు భారీ జనసందోహం మధ్య ముగిశాయి. ఆదివారం వెంకటగారిపల్లి సత్రం వద్ద జరిగిన పీర్ల భేటీ చూపరులను ఆకట్టుకుంది. వేడుకల్లో 11వ రోజు మండల పరిధిలోని మాల్యవంతం, లింగారెడ్డిపల్లి, వెంకటగారిపల్లి, అనంతసాగరం గ్రామాల పీర్లు వెంకటగారిపల్లి సత్రం వద్ద భేటీ అయ్యాయి. భక్తులు బెల్లపు ఉంటలను పీర్లపైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున నుంచే ఆయా గ్రామాల్లో పీర్లను వీధుల్లో ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ టీపీ శ్రీహర్ష సిబ్బందితో బందోబస్తు చేపట్టారు. పోట్లమర్రి, గంటాపురం, వేల్పుమడుగు, రాఘవంపల్లి, ఈదుల ముష్టూరు, సంజీవపురం, లింగారెడ్డిపల్లి, యర్రాయపల్లి, వెంకటగారిపల్లి, అనంతసాగరం, మాల్యవంతం తదితర గ్రామాల్లో జలధి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. విషాద గీతాలాపనతో తిరిగి పీర్లను ఒక మూటగా కట్టుకొని వచ్చి మకాన్‌లకు చేర్చారు.

తనకల్లు: మండల పరిధిలోని దుగినేపల్లి, ఉస్తినిపల్లి, మల్లిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు జరుపుకున్నారు. పీర్లను వీధుల్లో ఊరేగించిన అనంతరం అగ్ని గుండ ప్రవేశం చేశారు. యువకులు అలావ్ తొక్కుతూ సందడి చేశారు.

ఎన్‌పీకుంట: మండల పరిధిలోని ధనియానిచెరువు, పెడబల్లి గ్రామాల్లో మొహర్రం వేడుకలు ముగిశాయి. తొమ్మిది రోజులుగా పీర్లచావిళ్లలో కొలువుదీరిన పీర్లకు దూపం వేసి ప్రార్థనలు చేశారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి పుర వీధుల్లో ఊరేగించారు. ముజావర్లు చెక్కర చదివింపులు చేపట్టారు. జలధి ఉత్సవంలో భాగంగా పీర్లతో అగ్నిగుండ ప్రవేశం చేయించారు.

తాడమర్రి: మండలంలోని నార్శింపల్లిలో ఆదివారం మొహర్రం ఉత్సవాలు ముగిశాయి. పెద్ద కాశీం, చిన్న కాశీం, మౌలాలి తదితర పీర్లను రంగు, రంగుల నూతన వస్త్రాలు, వెండి గొడుగులతో అలంకరించారు. సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకూ గ్రామంలోని వీధుల్లో పీర్లను ఊరేగించారు. పీర్లతో అగ్నిగుండ ప్రవేశం చేసిన కార్యక్రమం ఆకట్టుకుంది.

అమడగూరు: పూలకుంటపల్లి, లోకోజుపల్లి, కస్సముద్రం గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో జలధి కార్యక్రమం నిర్వహించారు. చివరి రోజు యువకులు తడి బట్టలతో పీర్లస్వాములను ఎత్తుకుని ఊరేగించారు.

గాండ్లపెంట: గాండ్లపెంట, తూపల్లి, కటారుపల్లి, జీనులకుంట, కటకంవారిపల్లిలో మొహర్రం వేడుకలు నిర్వహించారు. చినమౌలాలీ, పెద్దమౌలాలీ పీర్లకు చదివింపులు చేయించారు.

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం నిడిమామిడి గ్రామంలో ఆదివారం జలధి కార్యక్రమంతో మొహర్రం వేడుకలు ముగిశాయి. స్థానిక బస్టాండు ప్రాంతంలో ఏర్పాటు చేసిన అగ్ని గుండం వద్ద యువత అలావ్ తొక్కుతూ సంబరాలు జరుపుకున్నారు. పీర్లను ఊరేగించి అగ్రిగుండ ప్రవేశం అనంతరం జలధికి తీసుకెళ్లారు.

తలుపుల: మండల కేంద్రంలో ఏటా జలధి మరుసటి రోజు ఆనవాయితీగా నిర్వహించే మస్తాన్‌వలి ఉరుసు పీరు ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పీరు చావిడి నుంచి తప్పెట్లతో ఊరేగింపుగా వెళ్లి తోటం శెట్టి వంశస్తులను, పోలీస్ స్టేషన్లో ఆహ్వానించారు. అనంతరం పీరు వద్ద చెక్కర, బూంది చదివింపులు చేయించారు.

నల్లమాడ: పుల్లగూరపల్లి, గోపేపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం జలధి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే పీర్ల చావిడి ముందు గుండం వద్ద కోళ్లు, పొట్టేళ్లు బలిచ్చారు.

పుట్టపర్తి టౌన్: పట్టణంలోని 2వ వార్డు పెద్ద బజార్, కొత్తచెరువు, కొడగానిపల్లి గ్రామాల్లో మొహర్రం ముగిసింది. ఆదివారం ఉదయాన్నే గుండం వద్ద పొట్టేళ్లను బలిచ్చారు. అనంతరం చావిడి ముందున్న అగ్ని గండం చుట్టూ పీర్ల స్వాములను ప్రదక్షిణలు చేయించి అగ్ని ప్రవేశం చేయించారు. అవాంఛనీయ సంఘటలు జరగకుండా సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని గొట్లూరు, మల్కాపురం గ్రామాల్లో ఆదివారం మొహర్రం వేడుకలు ముగిశాయి. ఈ సందర్భంగా మౌలాసాబ్.. పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెద్ద ఎత్తున చక్కెర చదివింపులు, బెల్లం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నల్లచెరువు: ఉబిచర్ల, గొర్లవాండ్లపల్లి, బాలేపల్లి తండా, మల్లిరెడ్డిపల్లి గ్రామాల్లో డప్పు మేళాలతో ఊరేగించారు. యువకులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండంలోకి ప్రవేశించి మొక్కులు చెల్లించుకున్నారు.

రామగిరి: మాదాపురం, గంగంపల్లి గ్రామాల్లో ఆదివారం జలధి వేడుకలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అగ్నిగుండ ప్రవేశం అనంతరం పీర్లను జలధికి తరలించారు.

కనగానపల్లి: మండలంలోని కోనాపురం, కొండపల్లి గ్రామాల్లో ఆదివారం మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పీర్ల స్వాములను అగ్నిగుండ ప్రవేశం చేయించి, భక్తుల కోలాహలం మధ్య జలధికి తరలించారు.



ధర్మవరం మండలం మల్కాపురంలో..



ఎన్‌పీకుంట మండలం ధనియాని చెరువులో..



పుట్టపర్తి టౌన్: జలధి పూజల్లో ప్రజాప్రతినిధులు



తనకల్లు మండలం దుగినేపల్లిలో..



తాడమర్రి మండలం నార్శింపల్లిలో..

గడప గడపలో సంక్షేమ లబ్ధి

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



ఎమ్మెల్యే సిద్దారెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

కదిరి టౌన్: సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా ప్రజలకు అందుతున్నామని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి తెలిపారు. ఆదివారం కదిరి రూరల్ మండలం కొండమనాయనపాళ్యం సచివాలయ పరిధిలోని చౌటితాండా, నల్లగుట్ట తాండాలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. తొలుత గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు పూలమాలలు, మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వ అధికారులతో మాట్లాడి పరిష్కరించదగ్గ సమస్యలకు వెంటనే పరిష్కారం చూపారు. మిగిలిన సమస్యలను సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగనన్న సుదీర్ఘ పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో 98.55 శాతం నెరవేర్చారన్నారు. కుల, మత పార్టీలకు అతీతంగా పథకాలు అందించారని కొనియాడారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టి దాదాపు 4 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించారన్నారు. ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలన్నారు. అనంతరం రూరల్ మండలంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం ముగిసిన సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట అమర్‌నాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రణీత్‌రెడ్డి, జెడ్పీటీసీ రాధాబాయి, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ, వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్, కన్వీనర్ ప్రకాష్, నాయకులు మణికంఠనాయక్, కృష్ణానాయక్, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డివిజన్‌స్థాయి సమావేశాల నిర్వహణకు చర్యలు



మాట్లాడుతున్న అవుటాల రమణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలోని రైతులకు వ్యవసాయ సూచనలు ఇస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమీక్షించడానికి ఇక నుంచి డివిజన్ స్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు జిల్లా అగ్రీ అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన సాక్షితో మాట్లాడారు. ఇప్పటి వరకూ వ్యవసాయ సలహా మండలి సమావేశాలు మొదటి శుక్రవారం ఆర్‌బీకే స్థాయి, రెండవ శుక్రవారం మండల స్థాయిలో, మూడవ శుక్రవారం జిల్లా స్థాయిలో వ్యవసాయ సలహా మండలి సమీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఇకపై ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, మడకశిర, హిందూపురం డివిజన్లలో సమీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా పండ్ల తోటలు, పశుసంవర్ధకశాఖ, సెరికల్చర్, మార్కెటింగ్, చిరుధాన్యాలు, ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించడానికి ఈ సమీక్షలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఆర్బీకే భవనాలను పూర్తి చేయించడానికి అధికారులతో పాటు కంట్రాక్టర్లతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. త్వరలోనే అన్ని ఆర్‌బీకేలను అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



తీవ్రంగా గాయపడిన రమేష్‌ను 108లో తరలిస్తున్న సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: వాటర్ ట్యాంకర్, స్కూటర్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనంలో వెళ్తున్న ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన బుక్కపట్నం మండలం జానికంపల్లిలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పుట్టపర్తికి చెందిన రమేష్ కుడికాలు పూర్తిగా విరిగిపోయింది. అపస్మారక స్థితిలోకి చేరుకున్న అతడ్ని స్థానికులు 108లో సత్యసాయి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు బుక్కపట్నం ఎస్‌ఐ నరసింహులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి: బాట సుంకులమ్మ ఆలయ సమీపంలోని కల్యాణ మండపం వద్ద ఆదివారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. వివరాలు.. ధర్మాపురం గ్రామానికి చెందిన రామాంజనేయులు బాటు సుంకులమ్మ దేవాలయం కల్యాణ మండపం వద్దకు వచ్చి అక్కడ మోరీలో విషద్రావకం తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని స్థానికులు గమనించి 108లో గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులు అనంతపురం రెఫర్ చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

- టింబక్టు కలెక్టివ్ చైర్‌పర్సన్ మేరీ



మహిళా శక్తి సొసైటీ సమావేశంలో మాట్లాడుతున్న సంస్థ ప్రతినిధులు

రామగిరి: మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని టింబక్టు కలెక్టివ్ చైర్‌పర్సన్ మేరీ అన్నారు. మండల కేంద్రంలోని ప్రముఖ స్వచ్ఛంద సంస్థ టింబక్టు కలెక్టివ్ సంస్థ సహకారంతో మహిళాశక్తి సొసైటీ 21వ వార్షిక మహాసభ ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంస్థ చైర్‌పర్సన్ మేరీ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని, ఆర్థికంగా బలపడితే సామాజికంగా సమానత్వం పొందొచ్చన్నారు. సంస్థ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కోసం చేపట్టిన పొదుపు, ఖర్చుల వివరాలు వెల్లడించారు. ముందుగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది అశ్విని, సుకన్య, రమ్య, గౌరి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఓటర్ల సర్వే పారదర్శకంగా చేయండి

రామగిరి: ఓటరు జాబితాలో వివరాలపై పారదర్శకంగా సర్వే చేయాలని తహసీల్దార్ నారాయణస్వామి పేర్కొన్నారు. ఆదివారం పేరూరులో కొత్త ఓటరు జాబితా పరిశీలనను బీఎల్‌ఓలతో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. ఓటర్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన జాబితాను పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నరసింహమూర్తి, వీఆర్‌ఓ జగదీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

సోమందేపల్లి: మండలంలోని నడింపల్లిలో శనివారం రాత్రి జరిగిన ఘర్షణలో గ్రామానికి చెందిన వెంకటేష్, ఆదినారాయణ గాయపడ్డారు. మొహర్రం సందర్భంగా అగ్నిగుండం వద్ద రెండు వర్గాల వారు ఘర్షణపడ్డారు. దీంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు 'స్పందన'

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరిదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సచివాలయ ఉద్యోగులు అర్జీలను స్వీకరిస్తారన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కమిటీ ఎంపిక



ఎంపికైన రెడ్‌క్రాస్ సొసైటీ ధర్మవరం శాఖ నూతన కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సాంస్కృతిక మండలిలో ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ పోలా ప్రభాకర్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ధర్మవరం ఉపశాఖ నూతన చైర్మన్‌గా డాక్టర్ నరసింహులు, వైస్ చైర్మన్‌గా నరేంద్ర రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బోనాల శివయ్య, సహాయ కార్యదర్శిగా మనోహర్‌గుప్త, కోశాధికారిగా సత్యనిర్దారణ్, బ్లడ్ డొనేషన్ అండ్ గ్రూపింగ్ చైర్మన్‌గా బీరే శ్రీరాములు, మొక్కల పెంపకం విభాగం చైర్మన్‌గా బత్తలపల్లి జయసింహ, కాలుష్య నివారణ పరిరక్షణ విభాగం చైర్మన్‌గా సుదర్శన్‌గుప్త, వృద్ధుల సామాజిక ఆరోగ్య ప్రణాళిక విభాగం చైర్మన్‌గా సత్యనిర్దారణ్‌ను ఎంపిక చేశారు. అలాగే సామాజిక వైద్య శిబిరాల విభాగం చైర్మన్‌గా సత్రసాల ప్రసన్నకుమార్, నేత్రదాన విభాగం చైర్మన్‌గా కె.నరేంద్రరెడ్డి, ఆర్గాన్ డొనేషన్ విభాగం చైర్మన్‌గా చంద్రశేఖర్, ప్రకృతి విపత్తులు, రోడ్డు ప్రమాదాల బాధితుల ఉపశమన విభాగం చైర్మన్‌గా రమేష్‌బాబు, శ్రీనివాస రెడ్డి, మహిళా సాధికారిక విభాగం చైర్మన్‌గా అంబటి అరుణశ్రీ,, న్యాయ సేవా విభాగం చైర్మన్‌గా కె.ఎం.అతావుల్లా, రెడ్‌క్రాస్ మెంబర్‌షిప్ ప్రమోషన్ విభాగం చైర్మన్‌గా గిర్రాజు పద్మనాభం, దివ్యాంగులు, స్త్రీలు, చేతివృత్తుల విభాగం చైర్మన్‌గా బాల త్రిపుర సుందరి, ఆకుల నాగార్జున, గౌరవ సలహాదారులుగా డాక్టర్ వివేక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలి



రహదారి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

ఎన్‌పీకుంట: మండలంలోని కదిరి–రాయచోటి ప్రధాన రహదారి నుంచి ఎగువపల్లి గ్రామానికి రూ.30 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న రహదారి పనులను ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆదివారం పరిశీలించారు. నాణ్యత లోపించకుండా పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అంతకు ముందు ఎర్రవంకలవారి పల్లి గ్రామంలో నిర్వహించిన సౌభాగ్య గంగమ్మ అమ్మవారి జాతరలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నాయకులతో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో మండల ఎంపీపీ ఈటెరాము, ఎంపీటీసీ సభ్యుడు తిమ్మారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, గ్రామకన్వీనర్ వెంకటేశ్వర్లు, నాయకులు తిరుమలనాయుడు, నారాయణస్వామి, శ్రీరాములు, మాజీఎంపీపీ సోమిరెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ ఓబులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం ఆకస్మిక తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమ

పెనుకొండ: పట్టణంలోని శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమా ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా గ్రంథాలయంలో రికార్డులు పరిశీలించారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు, పాఠకుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్‌ఎం మోహన్‌రెడ్డి, గ్రంథాలయాధికారి కె. మహబూబ్‌బాషా పాల్గొన్నారు.